క్లుప్తంగా

15న మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయమాధవి సోమవారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



ఏలేశ్వరంలో దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న సేవాశ్రమం ప్రతినిధులు

ఏలేశ్వరం: పట్టణంలోని దివ్యాంగులకు సోమవారం ఉచితంగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక క్వారీపేటలోని వికలాంగ, వయోవృద్ధుల సేవాశ్రమంలో 20 మంది దివ్యాంగులకు సేవాశ్రమం జిల్లా అధ్యక్షురాలు అంజూరి రాజకుమారి నిత్యావసరాల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతినెలా దివ్యాంగులకు ఉచితంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గణపతి, యేసు, శ్రీను, సత్యం, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లో ఓల్టేజ్ సమస్యతో ఇక్కట్లు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు కొత్తకాలనీ వాసులు విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. లో ఓల్టేజ్ కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, టీవీలు, ఇతర గృహోపకరణాలు కాలిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వినియోగం ఎక్కువగా ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ తక్కువగా ఉండటంతో తరచూ ఫీజులు పోతున్నాయని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రామాలయానికి పూజా సామగ్రి వితరణ



రామాలయానికి పూజా సామగ్రి వితరణ చేస్తున్న హిందూ పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: స్థానిక పైడిమల్లమ్మ అమ్మవారి ఆలయ సమీపంలోని రామాలయానికి సోమవారం విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పూజా సామగ్రి వితరణ చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటీ ఆధ్వర్యంలో మహిళలు విష్ణు సహస్రనామార్చన, భజన కాలక్షేపం చేశారు. రామాలయం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు తూము రౌతు గురయ్య, మల్లేశ్వరి, కుమారి, ఇందిరా, కల్యాణి, గిరిజ, చందక హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



కృష్ణునిపాలెంలో పట్టపగలే వెలుగుతున్న వీధి లైట్లు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో పట్టపగలే విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. గ్రామంలో పలు ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి వెలుగుతూనే ఉంటున్నాయి. దీంతో విద్యుత్ దుర్వినియోగం అవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పగటిపూట విద్యుత్ దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- కాయ నుంచి చెట్టు బెరడు వరకూ ఔషధ గుణాలు
- సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి
- పండ్లకు మార్కెట్‌లో డిమాండ్



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నేరేడు పండ్లు

కిర్లంపూడి: నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. తినడానికి కొంచె తియ్యగా, వగరుగా ఉన్నా వీటిలో పోషక విలువలు అధికం. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు ఔషధ గుణాలు, పోషకాల ఎక్కువగా ఉండటంతో వీటిని సర్వరోగ నివారిణిగా భావిస్తారు. పిల్లలు నేరేడు పలు ప్రాంతాల్లో జంబూఫలం, జామూన్‌గా పిలుస్తారు. ఈ పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా చెబుతారు. ఈ పండ్లలో విటమిన్ ఎ, సి అధికంగా ఉంటాయి. ఆక్సాలిక్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది. కాకినాడ, తూర్పుగోదావరి, చిత్తూరు, కృష్ణా వంటి జిల్లాల్లో ఇవి ఎక్కువగా పండుతాయి.

హైబ్రిడ్ రకానికి మరింత గిరాకీ

నేరేడులో నాటు పండ్ల కంటే హైబ్రిడ్ రకానికి గిరాకీతో పాటు ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తుతం కేజీ రూ.150 నుంచి రూ.170 వరకూ ఉంటే హైబ్రిడ్ కేజీ రూ.200 నుంచి రూ.250 వరకూ పలుకుతోంది. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. వీటన్నింటి నివారణకు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అయితే సహజ సిద్ధమైన నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాన్ని ఇస్తుంది.

నియోజకవర్గంలో...

జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో నేరేడు పండ్లు ఎక్కువగా లభిస్తాయి. గోకవరం మండలంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి పలువురు నేరేడు పండ్లను తీసుకువచ్చి జాతీయ రహదారిపై విక్రయిస్తున్నారు. పండ్లు తాజాగా ఉండటంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

ఉపయోగాలు ఇలా...

- శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.

నేరేడు చెట్టు ఆకులు విషాన్ని సైతం పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి.

- పొట్టలో ఉండే నులి పురుగులను నేరేడు నివారిస్తుంది. నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో దోహదపడతాయి.
- మధుమేహ వ్యాధి పీడితులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడి చేసుకుని ప్రతిరోజూ వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- మూత్రశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఉపయోగపడుతుంది.
- నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని ప్రతిరోజూ పుక్కిలిస్తే ఉపశమనం కలుగుతుంది.

ఆరోగ్యానికి మేలు



నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నేరేడు పండ్లకు విషాన్ని హరించే శక్తి ఉంది. శస్త్ర చికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకులను ఎక్కువగా వినియోగించేవారు. మధుమేహం, రక్తహీనత, బీపీతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఇవి ఔషధంగా పని చేస్తాయి.

–జ్యోతి మణిమాల, వైద్యాధికారి, గెద్దనాపల్లి పీహెచ్‌సీ

- నోటి పూత వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషధంగా పని చేస్తాయి.
- గర్భిణులు నేరేడు పండ్లను తినకూడదు.
- ప్రతిఒక్కరూ ఏడాదికి కనీసం 20 పండ్లు తింటే మంచి ఫలితాలుంటాయి.

సముద్రంలో చేపల వేటకు సన్నద్ధం



దానవాయిపేట తీరంలో బోటుకు మరమ్మతులు చేస్తున్న మత్స్యకారులు

తొండంగి: సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన చేపల వేట నిషేధం ఈ నెల 14తో ముగియనుంది. కేంద్రం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ దేశవ్యాప్తంగా సముద్రాల్లో వేట నిషేధాన్ని అమలు చేస్తోంది. మండలంలోని అద్దరిపేట నుంచి కొత్తచోడిపల్లిపేట వరకూ 17 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉంది. అద్దరిపేట, పంపాదిపేట, కొత్తపేట, అన్నయ్యపేట, యర్రయ్యపేట, వాడముసలయ్యపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లి తదితర మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ గ్రామాల పరిధిలో 483 మోటారు బోట్లు ఉన్నాయని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కేవలం నాటు పడవల మినహా మిగిలిన బోట్లు చేపలు వేట చేయకుండా ప్రభుత్వ విధించిన వేట నిషేధాన్ని అమలు చేశామన్నారు. ఈ నెల 15 నుంచి మత్స్యకారులు యథావిధిగా సముద్రంలో చేపలు వేట సాగించవచ్చని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట: వేసవి సందర్భంగా జగ్గంపేటలో బాటసారులు, ప్రయాణికులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, నాగపండు తదితరులు పాల్గొన్నారు.

వరుపుల సత్యప్రభకు అభినందనలు



ప్రత్తిపాడులో సత్యప్రభకు అభినందనలు తెలుపుతున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ నాయకులు

ప్రత్తిపాడు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించిన వరుపుల సత్యప్రభకు సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. నియోజవర్గంలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఎన్‌జీఓ సంఘ నాయకులు, సాంఘిక-బీసీ సంక్షేమ సంఘ నాయకులు ప్రత్తిపాడులో సత్యప్రభను కలిసి అభినందనలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ నాయకులు రామిశెట్టి రాంబాబు, ఎంవీ సత్యనారాయణరావు, ఏలేశ్వరం తహసీల్దార్ వై.రంగారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.పవన్‌కుమార్, వీఆర్వో సంఘ ప్రతినిధి అవసరాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



గోకవరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఎండీకేఎస్పీవీ పినన్స్ లే అవుట్‌లో సోమవారం కాకినాడకు చెందిన శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఈ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు, పలు ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో తాను త్వరలో బీజేపీలో చేరనున్నట్టు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టర్ స్వరూపారాణి, సిబ్బంది రమాసత్యనారాయణ, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



శంఖవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా అభియాన్ యోజనలో భాగంగా మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన 160 మంది గర్భిణులకు సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి ఆధ్వర్యంలో గైనకాలజిస్టు డాక్టర్ సునీత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

శంఖవరం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా 20 మంది గర్భిణులకు డాక్టర్ రామ్ రాజీవ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మేరీ మణి, పీహెచ్‌ఎన్ మేరి, హెచ్‌వీ వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సతీష్

జగ్గంపేట: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కె.సతీష్ కోరారు. జగ్గంపేటలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు ప్రారంభించాయన్నారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంవత్సరానికి అన్ని రకాల ఫీజులు కలిపి రూ.24 వేలు మించకూడదని ప్రభుత్వ నిబంధన ఉన్నా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దీనిని పట్టించుకోవడం లేదన్నారు. డొనేషన్లు, కాంపిటేషన్ల పేరుతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. గుర్తింపులేని విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు రాము, అర్జున్, సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి సాగర్‌లో అడుగంటిన జలాలు



ఇ.గోకవరం సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో అడుగంటిన జలాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మధ్యతహార సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ఈ ఏడాది భారీగా నమోదైన ఉష్ణోగ్రతలకు అడుగంటింది. గతేడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండలేదు. ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గాయి. దానికి తోడు ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్టులో జలాలు అడుగంటాయి. ఏటా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరేది. దీంతో ప్రాజెక్టు నిండు కుండను తలపించేది. కాగా ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోతే ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



కొత్తచోడిపల్లిపేట సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తొండంగి: మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, కొత్తచోడిపల్లిపేట, పంపాదిపేట, వాకదారిపేట, తాటియాకులపాలెం, కొత్తపేట, అన్నయ్యపేట తదితర సముద్ర తీరాల్లో సోమవారం పర్యాటకులు సందడి చేశారు. పాఠశాలలకు వేసవి సెలవులు ముగుస్తుండటంతో ప్రజలు కుటుంబ సమేతంగా బీచ్ చేరుకుని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు యువత బీచ్‌కు వచ్చి సముద్ర స్నానాలు చేశారు. విద్యార్థులు, యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాంతి ఆశ్రమంలో 28 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శాంతి ఆశ్రమం ఎయిడెడ్ పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 28 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కుటుంబ సమేతంగా కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అప్పట్లో గురువులు అందించిన విద్యాబుద్ధులే తమ విజయానికి సోపానాలుగా నిలిచాయని కొనియాడారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.సత్తిబాబు, కోరాపు రామారావు, శ్రీధర్, అనకాపల్లి శ్రీను, కోటి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

పెద్దాపురం: ఉరిమే ఉత్సాహం బాలలకే సొంతమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్(పీసీసీ) ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ సోమవారం పీసీసీ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్, వీర్రాజు మాట్లాడుతూ పిల్లల ప్రపంచం చాలా ఆనందమైందని, వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు. చదువు, ఆటపాటలు, సైన్స్ ప్రయోగాలు చెప్పడంతో వేసవి శిబిరంలో మంచి ఉత్సాహం చూపించారన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ వేసవిలో చల్లటి ఆహ్లాదకర వాతావరణంలో మంచి శిక్షణ ఇచ్చిన పీసీసీ కమిటీని అభినందించారు. పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ గంగాధరుడు, ప్రముఖ డాక్టర్ జమ్మి శిరీష, నరేష్ పెద్దిరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం వేసవి శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధులు జి.ప్రభాకరవర్మ, బేబీరత్నం, రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి

పెద్దాపురం: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరులో సోమవారం ఏర్పాటు చేసిన రైతు కూలీ సంఘ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలపై పలు సందేహాలున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు రావడం, వీటిలో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయని, తక్షణమే ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరారు.

అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యత్వానికి భామిరెడ్డి రాజీనామా

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యత్వానికి కర్రి భామిరెడ్డి (కాకినాడ) సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయన రాజీనామా చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా ఏడుగురు మహిళలతో సహా 15 మంది సభ్యులను 2023 మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరి పదవీ కాలం 2025 మార్చి వరకూ ఉంది.